

భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి,
డా॥ రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్,
కృషి విజ్ఞాన కేంద్రం, మెదక్

# సేంద్రియ వ్యవసాయం

ఎలాంటి రసాయన ఎరువులు, పురుగుల మందులు వాడకుండా సహజ వనరులతో, సాంప్రదాయ పద్ధతులలో పంటల్ని పండించడమే సేంద్రియ వ్యవసాయంగా చెప్పవచ్చు.

- సేంద్రియ వ్యవసాయం వలన నేలలో సారం, ఉత్పాదక శక్తి పెరుగుతుంది.
- చక్కని జన్యు వైవిధ్యం ఏర్పడుతుంది.
- సురక్షిత ఆహార ఉత్పత్తికి దోహదపడుతుంది.
- నేలలో కర్బనం పెరుగుదలకు పశువుల ఎరువుల పైనే కాకుండా పచ్చిరొట్ట, పచ్చి ఆకు, వర్మి కంపోస్ట్, చెరకు మడ్డి, కోడి పెంట, పంది, మేక ఎరువుల వాడకానికి ప్రాధాన్యమివ్వాలి.
- అన్ని రకాల సేంద్రియ, జీవన ఎరువులు వాడి తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు పొందవచ్చు.
- సస్యరక్షణలో వృక్ష, జీవ సంబంధ రసాయనాలు వాడి సహజవనరులు కాలుష్యానికి గురికాకుండా చూడవచ్చు.
- కాబట్టి ఇలాంటి జీవన ఎరువులు, సేంద్రియ ఎరువులతో చేసే వ్యవసాయం పర్యావరణానికి, మానవ మనుగడకు మేలు చేస్తుంది.
- సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయలు తినడం వలన శరీరానికి ఆరోగ్యమూ చేకూరుతుంది.





## సేంద్రీయ వ్యవసాయంలోకి ఎలా మారాలి ?

సేంద్రీయ వ్యవసాయం పెట్టుబడి లేని వ్యవసాయం. చాలా మంది రైతులు "సేంద్రీయ వ్యవసాయం అందరూ చేయలేరు, అది చాలా కష్టంతో కూడినది, మన వల్ల కాదు. రసాయన వ్యవసాయంలోనే సరైన ఆదాయాలు రావడం లేదు, ఇక సేంద్రీయ వ్యవసాయంలో ఆదాయాలు వస్తాయా?" అని నిట్టూరుస్తూ నిరుత్సాహపడుతుంటారు. కాని మనసు ఉంటే మార్గం ఉంటుంది. కృషి ఉంటే ఏదైనా ఫలిస్తుంది. అయితే సేంద్రీయ వ్యవసాయం ఒక్కసారిగా మొదలుపెట్టరాదు. ఒక యోజనతో 3, 4 సంవత్సరాల ముందు నుండి రసాయనాల వాడకం తగ్గిస్తూ, జీవామృతం వాడకం పెంచుతూ రావాలి. భూమిలో రసాయన ఎరువులు, కలుపు మందుల అవశేషాలు, పురుగు మందుల అవశేషాలు పూర్తిగా తొలగిపోవాలంటే సుమారు 3 నుండి 4 సంవత్సరాలు పడుతుంది. సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లిన మొదటి దశలో మూడు, నాలుగు సంవత్సరాల పాటు దిగుబడులు, ఆదాయాలు ఆశించిన రీతిలో రాకపోవచ్చును. తర్వాత నుండి తీసుకున్న శ్రద్ధను బట్టి అధిక దిగుబడులు, అధిక లాభాలు వస్తాయి.

### ఇతర సూచనలు

- మట్టిలో వానపాములు, సూక్ష్మజీవులు ఉంటే పంటలు అద్భుతంగా పండుతాయి.
- పంట కోత కాలం తర్వాత ఆకులను, మొక్కలను కాల్చకూడదు. వాటిని అచ్ఛాదనకు ఉపయోగించవచ్చు.
- రైతు వేసే ప్రధాన పంటలతోపాటు ఒకటి, రెండు అంతరపంటలు కూడా వేసుకుంటే అధిక ఆదాయం పొందవచ్చు.
- ఏ పంట అయినా మొక్కకు మొక్కకు మధ్య సరిపోయే దూరం ఉండాలి.
- సేంద్రీయ వ్యవసాయం వలన వాతావరణ కాలుష్యం నివారింపబడుతుంది.

**ఆహారం సరిగా లేనప్పుడు ఔషధంతో ప్రయోజనం ఉండదు.**

**ఆహారం సరిగ్గా ఉంటే ఔషధం అవసరం లేదు.**

